సాక్షి అనకాపల్లి

సోమవారం । 11 । ఆగస్టు । 2025



ఆసక్తిగా చదరంగం పోటీలు 8లో



కింగ్స్‌పై సన్‌ప్రైజర్స్ ఘన విజయం 8లో



'పరదా' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది 8లో

న్యూస్‌రీల్

13న ఉచిత జాబ్‌మేళా

అనకాపల్లి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 13న 11 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.గోవిందరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు పదో తరగతి, ఐటీఐ, డిప్లామా, డిగ్రీ, పీజీ వరకు చదువుకుని, 18 నుంచి 35 ఏళ్ల వ్యక్తులకు కంపెనీల ప్రతినిధులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను naipunyam.ap.gov.in వైబ్‌సైట్‌లో బయో డేటాను నమోదు చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు ఉదయం 9 గంటలలోపు హాజరుకావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 7981102224ను సంప్రదించాలన్నారు.

నేడు గోవాడ రైతుల 'చలో కలెక్టరేట్'

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడను కాపాడేందుకు నేరుగా సభ్యరైతులైన చెరకు రైతులే ఉద్యమబాట పట్టారు. ఇప్పటికే ఈనెల 9వతేదీన గోవాడ ఫ్యాక్టరీ వద్ద ధర్నా చేసిన చెరకు రైతులు ఈనెల 11వతేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఫ్యాక్టరీని తక్షణం ఆదుకోవాలని కోరుతూ ఫ్యాక్టరీ చెరకు రైతులు చేపట్టిన ఈ ఆందోళనకు ఫ్యాక్టరీ కార్మికులు, ఏపీ రైతు సంఘాలు తమ మద్దతు ప్రకటించారు. ఈ ఏడాది క్రషింగ్ జరుగుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో ఉన్న సభ్య రైతులు ఆందోళన చెందుతూ తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేయాలని స్వచ్ఛందంగా ఈ ఉద్యమానికి దిగారు. దీనిలో భాగంగా ఈనెల 11వ తేదీన అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని రైతులు నిర్ణయించారు. రైతులంతా ఫ్యాక్టరీ గేటు వద్దకు సోమవారం ఉదయం 9గంటలకు హాజరుకావాలని, ఇక్కడ నుంచి ఏర్పాటు చేసిన వాహనాల్లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లడం జరుగుతుందని రైతులు తెలిపారు.


కనకమహాలక్ష్మి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

డాబాగార్డెన్స్ (విశాఖ): ఉత్తరాంధ్ర కల్పవల్లి కనకమహాలక్ష్మి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వారికి అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేసి, అమ్మవారి ప్రసాదం అందజేశారు. వీరితోపాటు బీసీ వెల్ఫేర్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో శోభారాణి, ఏఈవో రాజేంద్రకుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సెప్టెంబర్ 14న నేషనల్ డాగ్ షో



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెన్నెల్ అసోసియేషన్ సభ్యులు

మద్రిపాలెం (విశాఖ): సెప్టెంబర్ 14న నేషనల్ డాగ్ షో నిర్వహిస్తున్నట్లు విశాఖ కెన్నెల్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఆర్ అండ్ బీ సమీపంలోని ఒక ఫంక్షన్ హాల్లో ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కెన్నెల్ క్లబ్ ఆఫ్ ఇండియా సహకారంతో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ గాదిరాజు ప్యాలెస్‌లో ఈ డాగ్ షో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊటీ, కొడైకెనాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కోల్‌కతా, జార్ఖండ్, చత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల నుంచి 50 జాతులకు చెందిన 300 కుక్కలు ఈ షోలో పాల్గొంటాయని వివరించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, రాజేశ్వరరావు, సీరట్ల శ్రీనివాస్, సూర్యప్రకాష్ రెడ్డి, కృష్ణప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు.. మరింత బరువు!



- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండోసారి పెరిగిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- రకాన్ని బట్టి బస్తాకు రూ.50 నుంచి రూ.330 వరకు పెరుగుదల
- సగం పెట్టుబడి ఎరువులకే వెచ్చించాల్సి వస్తోందంటున్న రైతన్నలు
- జిల్లాలో రెండు సీజన్లలో సుమారు 2 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- ఆందోళన చెందుతున్న రైతులు

- మొత్తం 51వేల మెట్రిక్ టన్నులకు పైగా ఎరువుల వినియోగం
- ఇందులో 22 వేల మెట్రిక్ వరకు కాంప్లెక్స్ ఎరువుల వాడకం
- జిల్లా రైతాంగంపై ఏడాదికి రూ.2.20 కోట్ల అదనపు భారం

అన్నదాతలకు పిడుగులాంటి వార్త. కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో వరుసగా రెండోసారి ఎరువుల ధరలు భారీగా పెరిగాయి. ఇప్పటికే కష్టాలు, నష్టాలు మోస్తూ ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతన్నకు ఎరువుల రూపంలో మరోసారి అదనపు భారం పడుతోంది. పెరిగిన ధరలతో జిల్లా రైతాంగంపై ఏడాదికి రూ.2.20 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది.

యలమంచిలి రూరల్ : రాష్ట్రంలో కూటమి పాలనలో పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతున్న రైతులపై ఎరువుల ధరలు దరువు వేస్తున్నాయి. ఇప్పటికే ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు లేక పంటల సాగుపై నీలినీడలు కమ్ముకున్న సమయంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెరగడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి ఎదురవుతోందని అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఓవైపు సాగు ఖర్చులతో పాటు పెరిగిన ఎరువుల ధరలతో రైతులు సతమతమవుతున్నారు.

బస్తాకు రూ.50 నుంచి రూ.330 వరకూ...

జిల్లాలో ఖరీఫ్,రబీ సీజన్‌లలో రైతులు 2 లక్షల ఎకరాల్లో పంటల సాగు చేస్తారు. వీటి కోసం సుమారుగా 51,277 మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తారు. వీటిలో సుమారుగా 22,000 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను పంటల సాగులో వినియోగిస్తుంటారు. ఇందులో యూరియా, డీఏపీ, 28-28-0 రకం ఎరువుల ధరలు మినహాయిస్తే మిగతా వాటి ధరలు బస్తాకు రూ.50 నుంచి రూ.330 వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో పెరిగిన ఎరువుల ధరలు తగ్గించాలని రైతులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు.

రైతులపై అదనపు భారం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 64,101 హెక్టార్లు, రబీలో 16,011 హెక్టార్లలో వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. దీనిలో సింహభాగం వరి సాగవుతోంది. ఈ పంటల సాగుకోసం సుమారుగా 51,277 మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తారని వ్యవసాయాధికారుల అంచనా. వీటిలో సుమారు 22 వేల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఉంటుంది. ఒక యూరియా బస్తా 50 కేజీలు బరువు ఉంటుంది. సరాసరిన బస్తాకు రూ.100 చొప్పున పెరిగిన ధరను లెక్కిస్తే జిల్లా రైతాంగంపై ఏడాదికి రూ.2.20 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది. అమాంతం పెరిగిన ధరలతో ఆశించిన దిగుబడులు రాక,సాగు వ్యయం తడిసిమోపెడవడంతో ఆశించిన లాభం రావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంటోంది. వారికి అప్పులే మిగులుతున్నాయి.

నియంత్రణ లేని ధరలు

యూరియాపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ఉంది. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో నియంత్రణ లేకపోవడంతో ఆయా కంపెనీలు తయారీ ఖర్చుల ఆధారంగా ధరలు పెంచుకుంటూ పోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఫాస్పరస్, పొటాష్ ధరల పెరుగుదలతో కాంప్లెక్స్(మిశ్రమ) ఎరువుల తయారీ ధరలు పెరిగాయి. ఎరువుల ఉత్పత్తికి వినియోగించే ముడి పదార్థాల ధరలు పెరిగిపోవడంతో ఎరువుల ధరలు పెరిగినట్టు డీలర్లు చెబుతున్నారు. దీంతో పంటల సాగు ఖర్చు ఎకరాకు రూ.2 వేల వరకు పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. సాగుకయ్యే ఖర్చులో సగం పెట్టుబడి ఎరువులకే వెచ్చించాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు.

పాత, కొత్త ధరలు ... రూ.ల్లో(50 కిలోల బస్తా)

ఎరువు రకం	పాత ధర	కొత్త ధర
పొటాష్	1535	1800
20-20-013(ప్యాక్ట్)	1300	1425
20-20-013(గ్రోమోర్)	1300	1350
20-20-013(పీపీఎల్)	1300	1400
డీఏపీ	1350	1350
10-26-26	1470	1800
14-35-14(గ్రోమోర్)	1700	1800
28-28-0	1700	1700
12-32-169(ఇఫ్కో)	1470	1720
16-16-16	1450	1600
15-15-15-0-9	1450	1600
16-20-0-13	1250	1300
24-24-0(మహాధన్)	1700	1800
20-20-013(మహాధన్)	1350	1450
సింగిల్ సూపర్ ఫాస్పేట్	580	640

మోయలేని భారం



అసలే సాగు పెట్టుబడులు పెరిగి వ్యవసాయం అంటేనే భయపడుతున్న తరుణంలో ఎరువుల ధరలు పెంచడం దారుణం. వీటిని నియంత్రించాలి. పెరిగిన ధరలతో సాగు చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితి వచ్చింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పెరిగిన ఎరువుల ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

– కర్రి అప్పారావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు

ఇంత ఖర్చుతో సాగు ఎలా..?



పెట్టుబడి ఖర్చులతో వ్యవసాయం భారంగా మారిన తరుణంలో ప్రభుత్వాలు ఇలా ఎరువుల ధరలు పెంచడం దారుణం. ధరల పెరుగుదల గుదిబండగా మారింది. ప్రభుత్వ అనాలోచిత విధానాల వల్ల మేం వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొంది. ఎరువుల ధరలకు రెక్కలు రావడంతో మా ప్రాంతంలో రైతులందరూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోతే అప్పుల పాలుకాక తప్పదు.

– కాళ్ల శ్రీనివాసరావు, రైతు, పోతురెడ్డిపాలెం, యలమంచిలి మండలం

బల్క్‌డ్రగ్ పార్క్‌ను అడ్డుకోవాల్సిందే!



తీరప్రాంతంలో సమావేశమైన మత్స్యకారులు



టీడీపీ నేత చేసిన వ్యాఖ్యలతో రెచ్చిపోయి వేదిక వద్దకు దూసుకొస్తున్న మత్స్యకారులు (ఫైల్)

- రాజయ్యపేట మత్స్యకారుల నిర్ణయం
- అవసరమైతే టీడీపీకి మూకుమ్మడి రాజీనామాలు
- తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- త్వరలో కార్యాచరణ ప్రణాళిక

నక్కపల్లి : రాజయ్యపేట సమీపంలో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్క్‌ను అడ్డుకుని తీరాల్సిందేనని మత్స్యకారులు నిర్ణయించారు. ఆదివారం రాజయ్యపేటలో మత్స్యకారులంతా వేటకు విరామం ప్రకటించి సమావేశమయ్యారు. ఈ ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దని హోంమంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లాలని, అప్పటికీ స్పందన లేకపోతే తీరప్రాంత గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు మూకుమ్మడిగా పార్టీకి రాజీనామా చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఆదివారం రాజయ్యపేటలో సమావేశమయిన పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ బల్క్‌డ్రగ్ పార్క్ పేరుతో రాజయ్యపేట పరిసర ప్రాంత గ్రామాల్లో వందలాది ప్రమాదకర రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిపై ఈనెల 6వ తేదీన నక్కపల్లిలో నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో మత్స్యకారులు, యాదవ సామాజికవర్గానికి చెందిన వారు వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలతోపాటు కొంతమంది జనసేన నాయకులు సైతం ఈ బల్క్‌డ్రగ్‌పార్క్‌ను తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. అయితే వారిని వేదిక వద్దకు రాకుండా పోలీసుల సాయంతో అడ్డుకున్నారన్నారు. ఇక్కడ ప్రమాదకర పరిశ్రమలు ఏర్పాటయితే రాజయ్యపేట, బోయపాడు, బుచ్చిరాజుపేట, తీనార్ల, తదితర గ్రామాల్లో నివసించేవారు అనేక ప్రాణంతకమైన వ్యాధులతో బాధపడతారన్నారు. బల్క్‌డ్రగ్ పేరుతో వందలాది కంపెనీలు ప్రారంభిస్తే ఈ ప్రాంతమంతా శ్మశానంగా మారుతుందన్నారు. పరిసరాల్లో జీవించడానికి ఎవరూ సాహసం చేయరన్నారు. గ్రామస్తులంతా పార్టీల కతీతంగా ఐకమత్యంగా బల్క్ డ్రగ్ పార్క్‌ను ఎదుర్కొవాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుని ఉద్యమాన్ని ఉధృతం చేయాలని, కేసులకు భయపడే ప్రసక్తి లేదని సమావేశంలో తీర్మానించారు. రసాయన కంపెనీల వల్ల తాము పడే కష్టాలను ప్రజాభిప్రాయసేకరణలో చెప్పుకునే అవకాశం కూడా కల్పించలేదని మత్స్యకారులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు.

అగ్గి రగిల్చిన టీడీపీ నేత వ్యాఖ్యలు

ప్రజాభిప్రాయసేకరణలో ఒక టీడీపీ నేత కంపెనీకి అనుకూలంగా మాట్లాడుతూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మత్స్యకారులను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం వల్లే వారు రెచ్చిపోయారన్న ప్రచారం జరుగుతోంది. వేదిక ముందు ఈ నాయకుడు మాట్లాడుతున్న సమయంలో వందలాది మంది మత్స్యకారులు అరుపులు కేకలతో నాయకుడి ప్రసంగాన్ని అడ్డుకున్నారు. బారికేడ్లు తోసుకుంటూ వేదిక వద్దకు చొచ్చుకు వచ్చే ప్రయత్నం చేశారు. టీడీపీ నాయకుడి ప్రసంగాన్ని అడ్డుకోకుండా అతనికి వత్తాసు పాడిన రాజయ్యపేటకు చెందిన ఇద్దరు కార్యకర్తలపై గ్రామస్తులు మూకుమ్మడిగా దాడి చేశారు. కంపెనీకి అనుకూలంగా మత్స్యకారులను రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన టీడీపీ నాయకుడిని బయటకు వచ్చేక కొంతమంది అడ్డుకుని నిలదీశారు. 'కంపెనీ మా గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్నారు... నీకేం తెలుసని మాట్లాడుతున్నావ్... నష్టపోయేది మేము... పోయే ప్రాణాలు మావి...మీకేంటి సంబంధం?' అంటూ నిలదీయడంతో సదరు నాయకుడు నీళ్లు నమిలాడు. రైతులకు ప్యాకేజీ, నష్టపరిహారం హోంమంత్రి వల్లే వచ్చిందంటూ నాయకుడు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. దీంతో మత్స్యకారులు, వైఎస్సార్‌సీపీ, వామపక్ష నేతలు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బల్క్ డ్రగ్ పార్క్ ప్రజాభిప్రాయసేకరణపై ప్రజల్లో నుంచి తీవ్ర వ్యతిరేకత రావడానికి వేదికపై ఒక నాయకుడు రెచ్చగొట్టే విధంగా చేసిన వ్యాఖ్యలే కారణమని టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఇతని ప్రసంగ వీడియోను అసమ్మతి నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పార్టీ అధిష్టానం అతని వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధిని పార్టీ అధిష్టానం ప్రశ్నించినట్లు బోగట్టా.

13న 'క్విట్ కార్పొరేట్స్' నిరసన ర్యాలీ



సీఐటీయూ కార్యాలయంలో సంఘీభావం తెలియజేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకిస్తూ ఈనెల 13న క్విట్ కార్పొరేట్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రైతు సంఘాల నాయకులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో పలు రైతు సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా అమెరికా, బ్రిటన్ దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలను చేపడుతుందని, రైతులకు నష్టదాయకంగా జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని సవరించే ముసాయిదాను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. కార్మిక చట్టాలను కాలరాసే 4 లేబర్ కోడ్‌ల అమలు, ప్రజలపై విద్యుత్ భారం మోపేలా అదానీ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు చర్యలు చేపడుతున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీల కోసం వేలాది ఎకరాల భూ సేకరణ చేపడుతూ, సన్న చిన్నకారు రైతులను, దేశ ప్రజలను నిర్వాసితులను చేస్తోందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ 'క్విట్ ఇండియా' ఉద్యమస్ఫూర్తితో 'క్విట్ కార్పొరేట్స్' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు గాడి బాలు, సీఐటీయు జిల్లా నాయకులు ఆర్.శంకర్ రావు, శ్రీనివాసరావు, ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ సురేష్ బాబు, ఏపీ రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు పాల్గొన్నారు.

ఈ నిర్లక్ష్యానికి చికిత్స ఏదీ..!



జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రి ఇది. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అక్కడ లభించే ఆదరణ ఇదీ. సిబ్బంది పట్టించుకోక, వైద్యమందక...వేచి చూసి చూసి ఓపిక నశించి రోగులు అక్కడే నడుం వాల్చే దయనీయ పరిస్థితులు ఇక్కడ కనిపిస్తాయి. ఆదివారం ఆస్పత్రికి సుమారుగా 60 సంవత్సరాల వయసు గల వృద్ధుడు (అనాథ వృద్ధుడు) వైద్యం నిమిత్తం వచ్చినప్పటికీ అతనిని వైద్య సిబ్బంది పట్టించుకోలేదు. దీంతో అలా ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగంలో మెట్ల వద్దనే పడుకున్నాడు. ఈ ఆస్పత్రిలో రోగులను పరీక్షించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, రాజకీయ జోక్యం ఎక్కువగా ఉండడంతో ఉన్న వైద్యులపై ఒత్తిడి పెరిగిపోతుందని, దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రిలో వైద్యసేవలు మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.

– అనకాపల్లి

కొనసాగిన అప్పన్న ఆభరణాల తనిఖీ



సింహగిరిపై మ్యూజియంలో ఆభరణాలను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి చెందిన ఆభరణాల తనిఖీ ఆదివారం రెండో రోజు కూడా కొనసాగింది. దేవాదాయ శాఖ రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల కమిటీ ఈ తనిఖీలను నిర్వహించింది. సింహగిరిపై ఉన్న ఆలయ మ్యూజియంలోని స్వామివారి బంగారు, వెండి ఆభరణాలను, ఇతర వస్తువులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. రిజిస్టర్లలో ఉన్న వివరాలకు అనుగుణంగా వస్తువులు సరిగ్గా ఉన్నాయో లేదో ఈ బృందం నిర్ధారించింది. ఈ తనిఖీల్లో విజయనగరం డిప్యూటీ కమిషనర్ కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్, దేవాదాయ శాఖ జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి పల్లంరాజు, అంతర్వేది దేవస్థానం ఈవో ఎం.కె.టి.ఎన్. ప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా డిప్యూటీ ఈవో ఇ.వి.సుబ్బారావు, రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. వారికి దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో రమణమూర్తి అవసరమైన వివరాలను అందజేశారు.

సమర్థ న్యాయవాదులు అవసరం

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



న్యాయవాది సత్యనారాయణ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజు

విశాఖ లీగల్: న్యాయ వ్యవస్థ బలోపేతం కావడానికి సమర్థవంతమైన న్యాయవాదులు అవసరమని గుజరాత్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. స్వయంకృషి, సత్సంకల్పం మనిషి ఎదుగుదలకు మూలస్తంభాలని వ్యాఖ్యానించారు. జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో ఆదివారం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దివంగత న్యాయవాది ఎం.సత్యనారాయణ చిత్రపటాన్ని జస్టిస్ రాయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించారని గుర్తుచేసుకున్నారు. సహచర న్యాయవాదులు, న్యాయమూర్తులతో ఆయన కేసులను వివరించే తీరు, ప్రవర్తన నేటి యువ న్యాయవాదులకు ఆదర్శం కావాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ దిగువ స్థాయి నుంచి ఎదిగి, మంచి ప్రతిభతో, స్ఫూర్తితో ఎందరో న్యాయవాదులకు సత్యనారాయణ మార్గదర్శకంగా నిలిచారన్నారు. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె. శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్టుల్లో సత్యనారాయణ వ్యవహరించిన తీరు తమకు ఎంతో నేర్పిందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణ మోహన్, సభ్యుడు పి.నర్సింగరావు, న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.పి.నాయుడు, ప్రముఖులు పైలా సన్నీబాబు, నమ్మి సన్యాసిరావు, సత్యనారాయణ కుమారుడు, న్యాయవాది అనిల్ కుమార్, రాచకొండ ఉమా శాస్త్రి, జి.ఎం.రెడ్డి, చీమలపాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు



- వైఎస్సార్‌సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత

గొలుగొండ : కూటమి పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లోచల సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం సాయంత్రం ఏఎల్‌పురంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వల్ల మహిళలపై అనేక దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల ముందు చంద్రబాబు, కూటమి నాయకులు అనేక అబద్దపు హామీలు ఇవ్వడం వల్ల ప్రజలు మోసపోయారన్నారు. మహిళల కు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తామని చెప్పి ఇప్పుడు కొన్ని బస్‌లకు మాత్రమే పరిమితం చేయడం జరుగుతుందని కూటమి పాలకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీని వల్ల ఉచిత బస్ ప్రయాణం పథకం పక్క దారి పట్టిందన్నారు. బడిగుడి అనే తేడా లేకుండా రాష్ట్రం, జిల్లా, మండలాల్లో మద్యం దుకాణా లు ఇవ్వడం జరిగిందని, ఇది చాలదన్నట్టు ప్రస్తుతం పర్మిట్ రూంలకు వీలు కల్పిస్తూ కొత్త గా చట్టం తీసుకురావడం వల్ల మహిళలు రోడ్డు మీదిగా రావాలంటే బయపడే పరిస్థితి వచ్చిందన్నారు. తల్లికి వందనం పథకంలో చాలామంది తల్లులకు అన్యాయం జరిగిందని, నేటికీ చాలామందికి ఆర్థికసాయం అందలేదని ఆరోపించారు.

9 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ఎస్‌.రాయవరం : వేమగిరి సమీపంలో కోడిపందాలు ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి 9మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ విభీషణరావు తెలిపారు. పందెం రాయుళ్ల నుంచి రూ.730 నగదు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వివరాల మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడు అరెస్టు



నిందితుడితో సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ సతీష్

చీడికాడ : మండలంలోని బోయపాడు(ఎల్‌.బి.పట్నం)లో శనివారం జరిగిన వృద్ధురాలి హత్య ఘటనలో నిందితుడు పవన్‌సాయిని ఆదివారం అరెస్టు చేసినట్టు కె.కోటపాడు సీఐ పైడపునాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కుదరా పవన్‌సాయి అనే యువకుడు గంజాయి, మద్యానికి బానిసవగా, కుటుంబ సభ్యులు అతడిని విశాఖలో గల మానసిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. బతుకు తెరువు కోసం ఆ యువకుడి తల్లిదండ్రులు కంచరపాలెం వలసవెళ్లగా యువకుడు వారి వద్దనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు బోయపాడు వచ్చిన పవన్‌సాయి 9వ తేదీ తెల్లవారు జామున బహిర్భూమికి వెళుతున్న వృద్ధురాలు గండి పైడితల్లమ్మపై మద్యం మత్తులో కర్రతో కొట్టి అనంతరం బండరాయితో మోది చంపాడు. దీనిపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందుతుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఎస్‌ఐ బి.సతీష్ పాల్గొన్నారు.

పింఛన్.. టెన్షన్

దివ్యాంగుల్లో..'రీ వెరిఫికేషన్' ఆందోళన!

పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, అంగవైకల్యం, మానసిక వైకల్యం, ఎదుగూబొదుగూ లేని మనుషులు. ఇలాంటి దివ్యాంగుల బాధలు వర్ణనాతీతం. ఒక్కరుగా నడవలేరు. కొందరికి కర్ర ఊతం. ఇంకొందరికి అయినవారో.. మరొకరో సాయం. వీరిని చూస్తే ఎవరికైనా జాలి కలగక తప్పదు. ఎంత బిజీలో ఉన్నా తమ వంతు సాయం చేయాలనిపించక మానదు. అలాంటి వీరిపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. సామాజిక పింఛన్లు తీసుకుంటున్న పలు కేటగిరీల్లోని దివ్యాంగులను సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ పేరిట పిడుగుపాటుకు గురిచేసింది.

- భారీగా పింఛన్ల ఏరివేతకేనా?
- ప్రత్యేకంగా సదరం క్యాంపుల నిర్వహణ
- మరోసారి దివ్యాంగులకు వైద్య పరీక్షలు
- చిన్న తేడా ఉన్నా పింఛన్ తొలగించాలని ఆదేశాలు



విమ్స్ ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్లు వెరిఫికేషన్ కోసం వచ్చిన దివ్యాంగులు

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రక్రియతో దివ్యాంగుల్లో అలజడి నెలకొంది. ప్రభుత్వం తమ జీవితాలతో చెలగాటం ఆడుతోందన్న భయాందోళన మొదలయింది. రీ వెరిఫికేషన్‌లో సర్టిఫికెట్ రద్దు చేస్తే, వైకల్య శాతం తగ్గిస్తే.. లాంటి ఆలోచనలు వారిని మరింత ఆదోళనకు గురిచేస్తున్నారు. రీ వెరిఫికేషన్‌కు రాని వారికి తాజాగా పింఛన్ కోత పడింది. ఆరు నెలల నుంచి ఈ ప్రక్రియ సాగుతోంది. అనారోగ్యం, ఇతర కారణాలతో రీ వెరిఫికేషన్‌కు రాలేని వారి పింఛన్లకు ఆ తర్వాతి నెల్లో కోత విధిస్తున్నారు. మొన్న మంచాన పట్టిన వారిని, నిన్న మానసిక వికలాంగులను వదల్లేదు. ఇప్పుడు అంధుల బతుకుల్ని మరింత అంధకారంలోకి నెట్టేందుకు సిద్ధమయ్యారు.

రెండో విడత ఏరివేత

వివిధ కేటగిరిల్లో రూ.6 వేలు నుంచి రూ.15 వేలు పింఛన్ పొందుతున్న దివ్యాంగుల ఏరివేత కార్యక్రమానికి కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది. జిల్లాలో వీరు 21,306 మంది ఉండగా ఇప్పటి వరకు 16,187 మంది రీ వెరిఫికేషన్ పూర్తయింది. ఇంకా 5,119 మందికి రీ వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. వీరిలో కొంత మంది వివిధ కారాణాల వల్ల రీ వెరిఫికేషన్ కార్యక్రమానికి హాజరు కాలేదు. దీంతో పింఛన్ నిలుపుదల చేశారు. ఎంత మందికి నిలుపుదల జరిగిందన్న విషయాన్ని అధికార యంత్రాంగం గోప్యంగా ఉంచింది.

కూటమి సర్కార్ ప్రగల్భాలు

ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛన్ పెంపుపై ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఇపుడు లబ్ధిదారుల తగ్గింపు కుట్రకు తెరతీసింది. పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు తెలివిగా రీవెరిఫికేషన్ బాట పట్టింది. పరిశీలన చేయించుకోని వారికి తర్వాతి నెల నుంచే పింఛన్ కట్ చేస్తున్నారు. ఇప్పటికే సామాజిక పింఛన్లు తీసుకునే వారి మీద ర్యాండమ్ సర్వే చేసిన సంగతి తెలిసిందే. నెలకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.8 వేలు, 6 వేలు పింఛను తీసుకున్న మంచానికే పరిమితమైన దివ్యాంగులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. వీరికి పరీక్షల నిమిత్తం సంబంధిత ఆస్పత్రులకు రప్పిస్తున్నారు. ఇతర ప్రాంతాల వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నారు. దీంతో ఏ సాకు పేరిట తమ జీవనాధారమైన పింఛన్‌కు కోత పెడతారోనని దివ్యాంగుల్లో ఆందోళన నెలకొంది.



వెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు

మొత్తం దివ్యాంగులు	21,306
ఆర్థోపెడిక్	12,238
అంధులు	2,373
ఈఎన్‌టీ	2,287
మానసిక	4,408
రీ వెరిఫికేషన్ జరిగినవి	16,187
రీ వెరిఫికేషన్ చేయాల్సినవి	5,119
పింఛన్ల నిలుపుదల అంచనా	5-12 శాతం

తెగిపడిన విద్యుత్ వైరు మృత్యు పాశమై...

విద్యుత్‌షాక్‌తో మహిళా రైతు మృతి



మృతురాలు లక్ష్మమ్మ

చీడికాడ : మండలంలోని జైతవరానికి చెందిన ఒక మహిళా రైతు విద్యుత్ షాకు గురై మృతి చెందినట్లు ఎస్‌ఐ బి.సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జైతవరం గ్రామానికి చెందిన లాలం లక్ష్మమ్మ(36) ఆదివారం ఉదయం పశువులకు మేత కోసం గడ్డి కోసేందుకు సమీప గ్రామమైన బి.సింగవరం పొలాల్లోకి వెళ్లింది. ఉదయం వెళ్లిన లక్ష్మమ్మ ఎంతకీ తిరిగి రాకపోవడం , ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో మృతురాలి కుమారుడు పొలంలోకి వెళ్లి చూశాడు. అక్కడ తెగి పడిన విద్యుత్ వైరు మృతురాలికి అంటుకుని ఉండగా వైరును కర్రతో వేరు చేశాడు. మృతురాలి శరీరంపై విద్యుత్ షాకుతో అయిన కాలిన గాయాలు గుర్తించారు. ఘటనపై మృతురాలి భర్త కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

లారీని ఢీకొట్టి దెబ్బతిన్న కారు..

కారులో ప్రయాణికులకు తృటిలో తప్పిన ప్రమాదం



కశింకోట వద్ద ప్రమాదంలో దెబ్బతిన్న కారు



ప్రమాదంతో నిలిచిన వాహనాలు

కశింకోట : కశింకోట వద్ద జాతీయ రహదారిపై అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు ప్రమాదం నుంచి సురక్షితంగా త్రుటిలో బయటపడ్డారు. అనకాపల్లి నుంచి ఎలమంచిలి వైపు వెళుతున్న కారు కశింకోట పోలీస్‌స్టేషన్ వద్దకు చేరేసరికి ముందు వెళుతున్న లారీని తప్పించుకొని ముందుకు వెళ్లడానికి డ్రైవర్ ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో లారీని కారు పక్కగా ఢీకొంది. దీంతో కారు వెనక చక్రం, పక్క భాగం దెబ్బతిన్నాయి. అయితే ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ఒకే కుటుంబం డ్రైవర్, భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ప్రమాదం నుంచి అదృష్టవశాత్తూ బయటపడ్డారు. ఈ ప్రమాదం వల్ల వాహనాల రాకపోకలకు కొంత సేపు అంతరాయం కలిగింది . ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి, పోలీసులు ట్రాఫిక్ నియంత్రించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

'పరదా' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది

విశాఖలో సందడి చేసిన హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్

డాబాగార్డెన్స్: అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ మూవీ 'పరదా'చిత్ర యూనిట్ విశాఖలో వినూత్న తరహాలో పరదాలతో ప్రమోషన్ చేపట్టారు. సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కాంద్రేగుల దర్శకత్వం వహించిన ఈ సినిమా గురించి హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ ఆదివారం నగరంలోని ఓ హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఈ చిత్ర కథ సుబ్బు చుట్టూ తిరుగుతుందని, తన ఊరిలోని కఠినమైన మగవారికి మాత్రమే మద్దతిచ్చే సాంప్రదాయాల వల్ల విసిగిపోయిన సుబ్బు, ఓ ధైర్యమైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇద్దరు అపరిచితులు(దర్శన రాజేంద్రన్, సంగీత)తో కలిసి చేసే రోడ్ ట్రిప్‌లో కథన సీరియస్ మలుపు తిరుగుతుందన్నారు. ఇలాంటి ఆద్యంతం ఆసక్తి కలిగించే అంశాలు చిత్రంలో చాలా ఉన్నాయని పేర్కొన్నారు. విశాఖలో ఆర్కే బీచ్ అంటే తనకి ఎంతో ఇష్టమన్నారు. ఇక్కడ తను నటించిన చిత్రాలు ఘన విజయం సాధించాయని, ఆ నమ్మకంతోనే ఈ పరదా చిత్ర ప్రమోషన్ టూర్ కూడా విశాఖ నుంచే ప్రారంభించినట్లు తెలిపారు. దర్శకుడు ప్రవీణ్ కాంద్రేగుల కథ చెప్పగానే ఎంతో ఫ్రెష్‌గా కనిపించిందని, కచ్చితంగా ప్రేక్షకులకు నచ్చుతుందని పేర్కొన్నారు. దర్శకుడు ప్రవీణ్ కాంద్రేగుల మాట్లాడుతూ ఈ కథ, పాతుకుపోయిన సాంప్రదాయాలపై నేరుగా ప్రశ్నలు వేస్తూ, నిజాయితీగా సాగుతుందన్నారు. అనుపమ పరమేశ్వరన్ సుబ్బు పాత్రలో తన కెరీర్ లోనే బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చిందన్నారు. మృదుల్ సుజిత్ సేన్ సినిమాటోగ్రఫీ, పల్లె జీవితానికి, హిమాలయాల అందాలకు మధ్య ఉన్న తేడాను అందంగా చూపించిందన్నారు. నిర్మాతలు విజయ్, శ్రీధర్ మాట్లాడుతూ మెగాస్టార్ చిరంజీవి బర్త్ డే రోజున సినిమా రిలీజ్ కాబోతుందని పేర్కొన్నారు.

ఆసక్తిగా చదరంగం పోటీలు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో శ్రీ చాణిక్య డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పి.కృష్ణవరణ్య, ఎస్.చంద్రశేఖర్ విజేతలుగా నిలిచారు. రాపిడ్ విభాగంలో మొత్తం ఏడు రౌండ్లు జరిగాయి. ఈ రౌండ్లన్నిటిలోనూ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి పి.కృష్ణవరణ్య విజేతగా నిలిచాడు. ఈ విభాగంలో 98 మంది క్రీడాకారులు పోటీపడ్డారు. ఆరేసి పాయింట్లతో చంద్రశేఖర్, తనీష్, సైలేంద్ర ద్వితీయ స్థానంలో నిలవగా, ఐదున్నర పాయింట్లతో ఈశా, సందీప్‌లు తృతీయ స్థానంలో నిలిచారు. బ్లిజ్ విభాగంలోనూ ఏడు రౌండ్ల పాటు హోరాహోరీగా పోటీ జరిగింది. ఆరున్నర పాయింట్లతో ఎస్.చంద్రశేఖర్ విజేతగా నిలిచాడు. ఈ విభాగంలో 93 మంది పాల్గొన్నారు. ఆరు పాయింట్లతో ప్రశాంత్, తనీష్, కృష్ణ, వీర్రాజు ద్వితీయ స్థానాన్ని పంచుకున్నారు. ఐదున్నర పాయింట్లతో యుగేష్, వి. కుమార్ మూడవ స్థానంలో నిలిచారు. ఈ రెండు విభాగాల్లోనూ మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విజేతలను నంద్యాలలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌సీడీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్ రెడ్డి



పాయకరావుపేట : రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గుడిమెట్ల రాజశేఖర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి నుంచి నియమాక పత్రం అందినట్టు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తనకు ఆర్‌సీడీఎస్ జిల్లా అధ్యక్ష పదవి ఇచ్చినందుకు ఆర్‌సీడీఎస్ జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి వెంగలరెడ్డికి, రాష్ట్ర అధ్యక్షుడు వై.సురేంద్రరెడ్డికి, కో ఆర్డినేటర్ వి.వి.ఎస్.ఎన్ రెడ్డి బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

భార్యాభర్తలను ఢీకొన్న వ్యాన్

- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు
- బైకుపై రోడ్డు దాటుతుండగా దుర్ఘటన



సిగిరెడ్డి సత్యవతి (51)

కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామ కూడలి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త గాయపడి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలివి. అనకాపల్లి నుంచి యలమంచిలి మార్గంలో వెళుతున్న రెండు వ్యాన్లు పోటాపోటీగా ఒకదాన్ని దాటుకొని మరొకటి నిర్లక్ష్యంగా ముందుకు వెళ్లడానికి ప్రయత్నించాయి. ఇదే సమయంలో బయ్యవరం కూడలి వద్ద మలుపు వద్ద రోడ్డు దాటబోతున్న బైక్‌ను వెనుక నుంచి వ్యాన్ ఢీకొట్టింది. దీంతో బైక్ వెనుక కూర్చున్న బయ్యవరం గ్రామానికి చెందిన సిగిరెడ్డి సత్యవతి (51) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త వెంకటరమణ గాయపడి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. గుర్తు పట్టడానికి అనువుగాని విధంగా ఛిద్రమైన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. రైతు కుటుంబానికి చెందిన సత్యవతి, వెంకటరమణ కశింకోటలో కిరాణా సరుకులు కొనుగోలు చేసి బయ్యవరం గ్రామానికి వెళుతుండగా ప్రమాదం జరిగిందని చెప్పారు.

హోరా హోరీగా ఖోఖో పోటీలు



ఉత్సాహంగా సాగుతున్న బాలికల పోటీలు



పోటీ పడుతున్న బాలురు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల్లో ఈ నెల 9వ తేదీ నుండి 11 వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరుగుతున్న అండర్ -14,17,19 బాలుర, బాలికల విభాగంలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ -7 అంతరాష్ట్ర ఖోఖో పోటీలకు ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల నుంచి 180 కి పైగా జట్లు , సుమారు 2000 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలు నువ్వా నేనా అన్నట్లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఇప్పటివరకూ అండర్ -19 బాలికల విభాగంలో ప్రథమ స్థానం సిస్టర్ నివేదిత స్కూల్, హైదరాబాద్, ద్వితీయ స్థానం వెరిటాస్ సైనిక్ స్కూల్ తిరుపతి, తృతీయ స్థానాన్ని సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ ఏలూరు, హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, ఖమ్మం గెలుచుకున్నారు. మిగిలిన విభాగాల్లో జట్లు పోటీల్లో తమ సత్తా చాటి క్వార్టర్ ఫైనల్స్ దిశగా దూసుకు వెళ్తున్నారు. విజేతలకు సోమవారం జరిగే ముగింపు కార్యక్రమంలో బహుమతి ప్రదానం జరుగుతుంది. కార్యక్రమంలో సీబీఎస్ఈ పరిశీలకులు సిహెచ్‌ఎల్ఎం శ్రీనివాస్, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, ఆంధ్రా, తెలంగాణా నుంచి పోటీలకు హాజరైన విద్యార్థులు, కోచ్‌లు మేనేజర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండవ నీటిని పొదుపుగా వాడుకోవాలి

- స్పీకర్ అయ్యన్న, హోంమంత్రి అనిత
- తాండువ నీటి విడుదల



గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న హోంమంత్రి అనిత

నాతవరం : తాండవ రిజర్వాయర్ నీటిని రైతులు వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కోరారు. ఖరీఫ్ పంట సాగు కోసం తాండవ నీటిని ఆదివారం స్పీకర్ అయ్యన్న, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అయ్యన్న మాట్లాడుతూ జిల్లాలోనే మేజరు ప్రాజెక్టు అయిన తాండవను మనమంతా కాపాడుకుని, మన తర్వాత తరం వారికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. తాండవ ప్రాజెక్టు అభివృద్ధికి ఇంత వరకు రూ.8 కోట్లు మంజూరు చేశానన్నారు. తాండవను పూర్తిగా అభివృద్ధి చేసేందుకు మంత్రి నిమ్మల రామానాయుడును ఇటీవల రూ.20కోట్లు అడగగా.. ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. నాతవరం నుంచి తాండవ ప్రాజెక్టు రోడ్డును ఇరిగేషన్ నుంచి ఆర్‌అండ్‌బీకి విలీనం చేశామని, రూ.8 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు చేస్తామన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ తాండవ ప్రాజెక్టును మొదటసారిగా సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాండవ రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించేలా చర్యలు చేపడతామన్నారు. డీఈ అనురాధ మాట్లాడుతూ తాండవలో 372.0 అడుగులు నీరు ఉందని, రోజుకు 500 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తే 65 రోజులు ప్రవహిస్తుందన్నారు. ప్రస్తుతం కాలువల ద్వారా 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్టు చైర్మన్ కరక సత్యనారాయణ వైస్ చైర్మన్ జోగుబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, ఈఈ బాల సూర్యం, జేఈ శ్యామ్‌కుమార్, ఆర్డీవో వి.వి.రమణ, స్థానిక నాయకుడు నందిపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగ పరిరక్షణే ధ్యేయం



సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న గొంది చినబ్బాయ్

అనకాపల్లి: ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణే ధ్యేయంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, రాష్ట్ర కౌన్సిలర్ ఈ.ఎల్లయ్యబాబు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వారు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేందుకు పాలకులు చూస్తున్నారని, పోరాటాలు చేసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని ప్రయోగశాలగా చూడకూడదని, ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలు మార్చడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ప్రపంచమంతా శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందుతున్న తరుణంలో, భారతీయ విద్య కూడా పురోభివృద్ధి చెందాలన్నారు. మూఢ నమ్మకాలు, కులతత్వం, ప్రాంతీయతత్వం, మతతత్వాన్ని విడనాడే దిశగా విద్యా సంస్కరణలు ఉండాలని వారు పిలుపునిచ్చారు. సాంకేతిక విద్య, వైద్యం పేద ప్రజలకు అందని ద్రాక్షగా మారాయని, ఉన్నత విద్య అందరూ అభ్యసించే దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి జి.ఎస్.ప్రకాష్, యూటీఎఫ్ నాయకులు మామిడి బాబురావు, రవి, బండారు శంకర్, ఎం.కె.శ్రీకాంత్, రాము, వెంకటరమణ, ఆశ పాల్గొన్నారు.

కాంబోడియాలో చిక్కుకున్న ఆంధ్రుల్ని కాపాడండి

డాబాగార్డెన్స్: కాంబోడియాలో చిక్కుకున్న ఆంధ్రా కార్మికులను కాపాడాలని సీఎం చంద్రబాబును విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. వీరిని మోసగించిన ఏజెంట్ బొంగు మురళీ రెడ్డిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జగదాంబ జంక్షన్ సమీపంలోని సిటు కార్యాలయంలో జేఏసీ ప్రతినిధులు ఆదివారం మీడియాతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళికి చెందిన ఏజెంట్ మురళీరెడ్డి డేటా ప్రాసెసింగ్ జాబ్‌ల పేరిట మాయమాటలు చెప్పి ఏడుగురి నుంచి చెరో రూ.1.70 లక్షలు తీసుకుని కంబోడియా పంపించారని పేర్కొన్నారు. అక్కడ వారికి ఆ ఉద్యోగాలు ఇవ్వకపోగా, కంబోడియా ఏజెంట్లకు అప్పజెప్పి ఒక్కొక్కరితో మరో మూడు వేల డాలర్లు కట్టించుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి వారిని చైనీస్ సైబర్ మోసగాళ్లకు అప్పజెప్పి, వారిచే చట్ట వ్యతిరేక పనులు చేయించడానికి బలవంతం పెట్టారన్నారు. అందుకు అంగీకరించకపోవడంతో చిత్రహింసలకు గురి చేస్తున్నారని తెలిపారు. వీరిలో విశాఖకు చెందిన వారు ఒకరు, శ్రీకాకుళానికి చెందిన నలుగురు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఇద్దరు కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే సంబంధిత మంత్రులు, అధికారులు స్పందించి, వారిని కాపాడి, రాష్ట్రానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌వీ అచ్యుతరావు, సిటు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కుమార మంగళం, పి.మణి, కొండయ్య పాల్గొన్నారు.

2 వేల కిలోల వెండితో వినాయకుడు

చవితి ఉత్సవాలకు యూత్ ఐకాన్ అసోసియేషన్ సన్నద్ధం

డాబాగార్డెన్స్: విశాఖ మహానగరంలో యూత్ ఐకాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2 వేల కిలోల వెండితో వినాయకమూర్తిని ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధి శీరపు కనకరాజు తెలిపారు. ఈ మేరకు నగరంలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వినాయక ఉత్సవాల వివరాలు వెల్లడించారు. ఏటా మాదిరే ఈ ఏడాది కూడా వినాయక చవితి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది బీచ్‌రోడ్డు విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వెనుకనున్న ఏపీఐఐసీ గ్రౌండ్‌లో ఈ నెల 27 నుంచి 21 రోజుల పాటు చవితి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. 14 ఎకరాల గ్రౌండ్‌లో 6 ఎకరాల్లో పార్కింగ్, 2 ఎకరాల్లో ఫ్లవర్ షోతో, దేశంలోనే తొలిసారిగా 2 వేల కిలోల వెండి విగ్రహాన్ని వినూత్న రీతిన విశాఖలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. గర్భిణులు, వికలాంగులు, వృద్ధులకు ఉచిత దర్శనం కల్పిస్తామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయ నమూనా సెట్ వేయనున్నామన్నారు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులు పొందినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలనుకునే భక్తులు టీటీటీ. డ్వాఇజీభ్పాః. జ్ఞ్బుట ఛొర్ఘుల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.లక్ష్మణ్, ఎస్.లీలాధర్, బేరి మన్మధరావు, కె.భరత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కింగ్స్‌పై సన్‌షైనర్స్ ఘన విజయం



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నాలుగో సీజన్‌లో విజయవాడ సన్‌షైనర్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కాకినాడ కింగ్స్‌పై 24 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో విజయవాడ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేయగా, కాకినాడకు ఇది రెండో ఓటమి. నగరంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో టాస్ ఓడి తొలుత విజయవాడ బ్యాటింగ్‌కు దిగింది. టాప్ ఆర్డర్ విఫలమైనా, చివరిలో జహీర్ (57 నాటౌట్), తేజ (46 నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 195 పరుగుల భారీ స్కోరు చేసింది. కాకినాడ బౌలర్లలో స్పిన్నర్ ఆంజనేయులు మూడు వికెట్లు తీశాడు. అనంతరం 196 పరుగుల లక్ష్యఛేదనలో కాకినాడ కింగ్స్‌కు ఓపెనర్లు అర్జున్ (48), కెప్టెన్ భరత్ (34) తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యంతో శుభారంభం అందించారు. అయితే వారు ఔటైన తర్వాత కాకినాడ బ్యాటింగ్ ఆర్డర్ పేకమేడలా కూలిపోయింది. రవికిరణ్ (31) మినహా మిగతా వారు విఫలం కావడంతో మరో ఐదు బంతులు మిగిలి ఉండగానే 171 పరుగులకు ఆలౌట్ అయింది. విజయవాడ బౌలర్లు పృథ్వీ, టి.భరత్ చెరో మూడు వికెట్లతో కాకినాడ పతనాన్ని శాసించారు.

అదరగొట్టిన కెప్టెన్ హేమంత్

ఏపీఎల్‌లో భాగంగా వైఎస్సార్ స్టేడియంలో జరిగిన రెండో మ్యాచ్‌లో భీమవరం బుల్స్ జట్టు రాయలసీమ రాయల్స్‌పై 7వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న భీమవరం బుల్స్, రాయలసీమ రాయల్స్‌ను కట్టడి చేసింది. రాయల్స్ కెప్టెన్ రషీద్ (56) అర్ధశతకంతో రాణించినప్పటికీ.. ఆ జట్టు చివర్లో అనూహ్యంగా కుప్పకూలింది. కేవలం 17 పరుగుల వ్యవధిలో చివరి ఆరు వికెట్లను కోల్పోయి, మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే 139 పరుగులకు ఆలౌటైంది. బుల్స్ బౌలర్లలో సత్యనారాయణ మూడు వికెట్లు తీయగా, హరిశంకర్, మునీష్, హేమంత్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 140 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భీమవరం బుల్స్ కెప్టెన్ హేమంత్ అద్భుత ఇన్నింగ్స్‌తో సునాయాసంగా గెలిచింది. హేమంత్ 65 పరుగులు (3 ఫోర్లు, 6 సిక్సర్లు) చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతనికి వంశీకృష్ణ (27 నాటౌట్), సూర్యతేజ (23 నాటౌట్) చక్కటి సహకారం అందించడంతో బుల్స్ జట్టు 15.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

నరసాపురం ఆనకట్టకు లీకులు

- గేట్ల నుంచి వృథాగా పోతున్న నీరు
- నిధులు లేక తాత్కాలిక మరమ్మతులు
- శాశ్వత పరిష్కారం చూపని ప్రభుత్వం
- సాగుపై ఆయకట్టు రైతుల ఆందోళన



నరసాపురం ఆనకట్ట

కశింకోట: ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో తాత్కాలిక మరమ్మతులతో అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పర్యవసానంగా ఆయకట్టుకు సాగునీరందక పంటలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అమీన్‌సాహెబ్ పేట వద్ద శారదా నదిపై ఉన్న నరసాపురం ఆనకట్ట గేట్ల నుంచి నీరు లీకై దిగువకు వృథాగా పోతుండటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది సరిగా నీరందక పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

శారదా నదిపై నరసాపురం ఆనకట్ట కింద కశింకోట, యలమంచిలి మండలాల్లో 3,200 ఎకరాల ఆయకట్టు ఉంది. దీని నిర్మాణానికి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్థానిక రైతుల కోరిక మేరకు రూ.17.16 కోట్లు మంజూరు చేశారు. దీని పనులను యలమంచిలి నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్ చేపట్టి 2015కు దాదాపు పూర్తి చేశారు. అయితే తలుపులు అమర్చడానికి నిధులు లేకపోవడంతో విశాఖ డెయిరీ సహకారంతో రూ.1.30 కోట్లు ఖర్చు చేసి అమర్చారు. ఈ ఆనకట్టను 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఆనకట్ట నుంచి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందడంతో ఏటా పంటలు పండటంతో ఇది వైఎస్సార్ పుణ్యమే అంటూ రైతులు ఆనందంగా ఉండేవారు.

ఈ గ్రామాలకు ఆధారం..

కసింకోట మండలంలోని పల్లపు సోమవారం, ఏనుగుతుని, నూతల గుంటపాలెం, అచ్యుతాపురం, నరసింగబిల్లి తదితర గ్రామాలు, యలమంచిలి మండలంలోని జంపపాలెం, తురంగలపాలెం, యలమంచిలి, పెంజెరువు తదితర గ్రామాల భూములకు సాగునీరు అందుతోంది. ఏటా వరి, చెరకు సాగు చేస్తుంటారు. ఎక్కువగా ఖరీఫ్ వరి సాగు చేస్తారు. దీనికి వర్షం, ఆనకట్ట నీరు ప్రధాన ఆధారం.

నిధులు మంజూరుగాక..

ఆనకట్టకు ఉన్న నాలుగు గేట్ల నుంచి నీరు కొంత కాలంగా లీకై దిగువకు చాలా కాలంగా వృథాగా పోతోంది. ఇది గతేడాది నుంచి మరింత ఎక్కువైంది. దీనివల్ల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గేట్లకు రబ్బర్ లాక్‌లను నీరు లీక్ కాకుండా అమర్చాల్సి ఉంది. ఇలా అయితే నీరు దిగువకు పోకుండా కట్టడి కాగలదు. దీంతో రైతులు ఆనకట్ట గేట్లకు మరమ్మతులు చేపట్టాలని పలు దఫాలు నీటిపారుదల శాఖ అధికారులకు చాలా కాలంగా మొర పెట్టుకుంటున్నా పట్టించుకోని పరిస్థితి. ఇందుకు ప్రభుత్వం నంచి నిధులు మంజూరు కాకపోవడమే కారణమని అధికారులు పేర్కొంటున్నారు.

నాలుగు మోటార్లు పని చేస్తాయో.. లేదో

ఆనకట్ట అత్యవసర పరిస్థితిలో గేట్లు తెరవడానికి నాలుగు మోటార్లను ఆనకట్ట ప్రారంభించినప్పటికే ఏర్పాటు చేశారు. అయితే అప్పటి నుంచి 8 ఏళ్లు అవుతున్నా వాటికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి సదుపాయం కల్పించలేదు. దీంతో అవి ఎండకు ఎండి, వానకు తడిసి నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి ఇప్పుడు విద్యుత్ సదుపాయం కల్పించినా అవి పని చేస్తాయో, లేదో తెలియని దుస్థితిలో ఉన్నాయి. మాన్యువల్‌గా అయితే ఒక్కొక్క గేటు తెరవడానికి సుమారు 3 గంటల సమయం పడుతుంది. అదే మోటార్ల సహాయంతో 5 నిమిషాల వ్యవధిలోనే తెరవవచ్చు. అవి పని చేస్తాయో, లేదోనని, శ్రమ అయినా ప్రత్యామ్నాయంగా గేట్లను మాన్యువల్‌గా తెరవడానికి చర్యలు చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఆనకట్ట గేట్లు శాశ్వత మరమ్మతుకు రూ.15 లక్షల వరకు అవసరమని నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు.



గేట్ల నుంచి వృథాగా పోతున్న నీరు

అయితే నిధులు లేకపోవడంతో తాత్కాలికంగా పనులు చేపట్టడానికి రూ.6 లక్షలకు ప్రతిపాదనలు కుదించారు. అయినా నిధులు మంజూరు కాకపోవడం, ప్రస్తుతం ఆనకట్టలో నీరు ఉండటం వల్ల మరమ్మతులు చేపట్టే అవకాశం ఉండకపోవడంతో తాజాగా గేట్ల వద్ద నీరు కట్టడికి తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టారు.

ఆనకట్టలో నీరు లేనప్పుడే శాశ్వత మరమ్మతులు సాధ్యం

ఆనకట్ట నీటి సంఘం అధ్యక్షుడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో రూ.30 వేలతో జిల్లాలోని తాండవ ఆనకట్ట వద్ద లీక్‌ల నివారణకు చేపట్టిన తరహాలో ఇక్కడా నీరు ఎక్కువగా లీక్ అయ్యే గేట్ల దిగువ భాగాన నార గోనె సంచులను దింపి ఖాళీల్లో నీటి ప్రవాహ ఒత్తిడితో అమరేటట్టు ఏర్పాటు చేశారు. దీనివల్ల కొంతమేర నీరు లీక్ కాకుండా కట్టడి అయిందని, ఇప్పుడు ఆనకట్టలో నీటిమట్టం నిల్వ పెరిగి ఆయకట్టుకు సాగునీరు ఎక్కువగా వెళ్లే అవకాశం ఏర్పడిందని అధికారులు అంటున్నారు. ఇది తాత్కాలిక ఉపశమనమేనని, గోనెలు ప్రవాహ ఉద్ధృతికి కొట్టుకుపోతే నీరు యథావిధిగా దిగువకు పోయి సాగునీటి కాలువ నుంచి తగిన నీరు ప్రవహించక పంటలు నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆనకట్టలో నీరు లేనప్పుడే లీక్‌ల నివారణకు శాశ్వత మరమ్మతులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం వహించడం శోచనీయమని విమర్శిస్తున్నారు. దీనివల్ల ఈ ఏడాది పంటలకు నీరందక తీవ్రంగా నష్టపోవలసి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ముున్ముందు ఆనకట్టలో నీరు తగ్గిన పక్షంలో గేట్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టి ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం

నరసాపురం ఆనకట్ట గేట్ల మరమ్మతుకు రూ.6 లక్షలతో కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే ఆనకట్టలో నీరు లేనప్పుడు మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. తాండవ ఆనకట్ట తరహాలో ఇక్కడా నార గోనె సంచులను దింపి గేట్ల నుంచి నీటి లీక్‌ను కట్టడి చేయడానికి చర్యలు చేపట్టాం. దీనివల్ల ఆనకట్టలో నీటిమట్టం పెరిగి ఆయకట్టుకు సాగునీటి కాలువ ద్వారా ప్రవహిస్తోంది.

– ప్రేమ్, ఎఈ, నీటిపారుదల శాఖ, యలమంచిలి

క్లుప్తంగా

రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



పూలతో అలంకరించిన రాఘవేంద్ర స్వామి

అనకాపల్లి టౌన్: పట్టణంలోని వేల్పులవీధి రాఘవేంద్ర గురు సార్వభౌమ 354వ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రాఘవేంద్ర స్వామికి ఆదివారం పూజలు నిర్వహించారు. సాయంత్రం రాఘవేంద్ర స్వామి బృందావన సమితి ఆధ్వర్యంలో వేదపారాయణం, అన్నమాచార్య అమృతవర్షిణి కోలాట బృందం వారి కోలాటం ప్రదర్శన కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ఎనిమిది గంటలకు పల్లకీ సేవ, స్వస్తివాచనం, మహా మంగళ హారతి నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

మరిడిమాంబ ఘటాల ఊరేగింపు



ఘటాల ఊరేగింపులో కమిటీ సభ్యులు, భక్తులు

అనకాపల్లి: స్థానిక కోట్నివీధి మరిడిమాంబ మహోత్సవాన్ని ఈ నెల 14వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట్ని పూర్ణచంద్రరావు చెప్పారు. అమ్మవారి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఘటాల ఊరేగింపు కార్యక్రమాన్ని పుర వీధుల్లో నిర్వహించారు. అమ్మవారి మహోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు హరినాథ్, తలారి లక్ష్మీ ప్రసాద్, కోట్ని రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

24న మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద వినాయక చవితి పురస్కరించుకుని 3,500 మట్టి గణపతి ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్ శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మట్టి గణపతి విగ్రహాలు, వినాయక వ్రత కథ పుస్తకాలు, పసుపుకుంకుమ ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని 11 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కాపాడేందుకు మట్టి గణపతులను మాత్రమే పూజించాలన్నారు.

ఆలయ భూముల కౌలు వేలం రేపు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సీతారామస్వామి దేవస్థానం భూములు కౌలుకు సాగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్టు గ్రామ రెవెన్యూ అధికారి శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు దేవదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామన్నారు. కొరుప్రోలులో సర్వే నెంబర్ 101–4లో 4.86 ఎకరాలకు గాను రూ. 5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. గుర్రాజుపేటలో సర్వే నెంబర్ 136–2లో 0.33 ఎకరాలకు రూ. 20 వేలు, సర్వే నెంబర్ 133లో 4.46 ఎకరాలకు రూ.5 వేలు, సర్వే నెంబర్ 202–6లో 0.08 ఎకరాలు, 199–6 లో 0.06కి రూ.2 వేలు, ఇదే దేవస్థానానికి చెందిన నక్కపల్లి మండలం సీహెచ్‌ఎల్ పురంలో 72–1, 2లలో 7.48 ఎకరాలకు రూ. 20 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలన్నారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్ (మ్యాట్నీ, సెకండ్‌షో)
రాజా	: అతడు (ఫస్ట్ షో, మార్నింగ్ షో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్‌డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: సోమేశ్వర సులోచన
పర్తిసాయి	: మహావతార్ నరసింహం
షిర్డీసాయి	: బకాసుర రెస్టారెంట్
వెంకటేశ్వర	: మాతృ
శ్రీ సత్య	: జూనియర్
రామచంద్ర	: హరిహర వీరమల్లు

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 256 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 45 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6, బీ పాజిటివ్-11, ఓ పాజిటివ్-23, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

ఉపాధి కోరుతూ ఆటో కార్మికుల నిరసన



ఉపాధి కోసం నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఆటో కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ నిరుద్యోగులుగా ఉన్న అనేక మంది బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల వద్ద అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసి ప్రతి నెలా కిస్తీలు చెల్లించుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో సుమారు 10 లక్షల మంది ఉన్నారన్నారు. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే ఆటో కార్మికుల ఉపాధికి విఘాతం కలుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదన్నారు. అయితే ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ. 25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలన్నారు. గ్యాస్‌పై విధించిన వ్యాట్ తగ్గించాలన్నారు. 2019లో తీసుకొచ్చిన జీవో 21ను రద్దు చేయాలని, పెంచిన అన్ని రకాల ఫీజులు, పెనాల్టీలు తగ్గించాలన్నారు. బ్యాంకుల ద్వారా ఆటోల కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా నిత్యకల్యాణం..

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండప వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవింద రాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

జిల్లాలో పర్యావరణ విధ్వంసం ఆపాలి



జిల్లా జన విజ్ఞాన వేదిక కొత్త కార్యవర్గం

దేవరాపల్లి: జిల్లాలో పర్యావరణ విధ్వంసాన్ని ఆపాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి, కె.శేషగిరిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరాపల్లిలోని కైరలీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం జరిగిన అనకాపల్లి జిల్లా జన విజ్ఞాన వేదిక 18వ మహాసభకు రాష్ట్ర పరిశీలకుల హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సైంటిఫిక్ టెంపర్ పెంచడానికి సైన్స్ మేజిక్ షోలు, సైన్స్ ప్రయోగాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్నారు. ఈ రెండు అంశాలను తీర్మానం తీసి ప్రభుత్వానికి పంపించనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం జిల్లా జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎం.కె.దినేష్(దేవరాపల్లి), అధ్యక్షుడిగా ఎం.ఎస్.వి.ఎస్.పి. వర్మ(కశింకోట), ప్రధాన కార్యదర్శిగా కె.వరప్రసాద్(ఎస్.రాయవరం), ఉపాధ్యక్షులుగా బి.వి.ఎస్.వేణు(కె.కోటపాడు), బి.ఎస్.రామ్‌కుమార్(అచ్యుతాపురం), ప్రకాష్(చోడవరం) ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా నాగచంద్ర, వెంకట అప్పారావు, రాంబాబు, కోశాధికారిగా ఉమామహేశ్వరరావుతో ఏడుగురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



గ్రంథపాలకుడు రమణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక: అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో పని చేసి అచ్యుతాపురం బదిలీపై వెళ్లిన గ్రంథపాలకుడు ఎల్‌వీ రమణను ఆదివారం ఘనంగా సత్కరించారు. తిమ్మరాజుపేట గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయాధికారి వరలక్ష్మి, పెద్దలు ఆళ్ల మహేశ్వరరావు, ఎంపీ సత్యనారాయణ, టెక్కలి జగ్గారావు, ఉపాధ్యాయులు పిల్లా జగదీష్, దాడి రామప్పారావు పాల్గొన్నారు.

కశింకోటలో నారాయణ సేవ



అన్న దానం చేస్తున్న నిర్వాహకులు

కశింకోట: స్థానిక సత్యసాయి సేవా మందిరంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్ మాధవ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో పేదలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. నారాయణ సేవ (అన్న సమారాధన) నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు తిరుచోళ్ల రామకృష్ణ, శిష్టి అప్పారావు, నడిపల్లి సన్యాసిరావు, ప్రగడ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

16న కృష్ణాష్టమి వేడుకలు

కశింకోట: స్థానిక వేంకటేశ్వర ధ్యాన మందిరములో ఈ నెల 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ రోజు స్వామి వారిని శ్రీకృష్ణునిగా అలంకరించి ఉదయం సుప్రభాత సేవ, విశేష అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం స్వామి జనన ఘట్టం, ఊంజల్ సేవ, ప్రత్యేక హారతి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కశింకోటలో వర్షం

కశింకోట: మండల కేంద్రంలో ఆదివారం వర్షం కురిసింది. దీంతో రోడ్ల పక్క పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. కొద్ది రోజులుగా అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో వరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోతున్న వరినారుకు, నాట్లు వేయడానికి వర్షాలు ఉపకరించగలవని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా వాకర్స్‌కు ఆటల పోటీలు



పరుగు పందెంలో తలపడుతున్న వాకర్స్

చోడవరం: స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా చోడవరం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు ఒరుగంటి రాంబాబు చెప్పారు. ఈ క్లబ్‌లో 45 80 ఏళ్ల వయస్సున్న వారంతా సభ్యులుగా ఉన్నారన్నారు. వీరంతా ఈ పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్నింగ్, వాకింగ్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, తదితర పోటీలు పాల్గొని సత్తా చాటారు. విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.

వృద్ధుల కోసం సోషల్ సర్వీస్ గ్రూపు



గౌరీపతిని శాలువాతో సత్కరిస్తున్న సీనియర్ సిటిజన్స్



పాల్గొన్న గ్రూప్ సభ్యులు

అనకాపల్లి: వృద్ధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సోషల్ సర్వీస్ గ్రూపును ఏర్పాటు చేసినట్టు విశ్రాంత డిప్యూటీ డీఈవో కె.వి.గౌరీపతి తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో సోషల్ సర్వీస్ గ్రూపు ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. గ్రూపు సభ్యులు గౌరీపతిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో సభ్యులందరి సహకారంతో అనకాపల్లి మండలంలోనే కాకుండా ఇతర మండలాల్లో అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి 9 సంస్థలకు అవసరమైన నిత్యావసర సరుకులు, ఇతర సామగ్రిని అందజేశామన్నారు. అనంతరం 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు ఎం.బి.వి.స్వామి, వీరభద్రరావు, పావడ సత్యారావు, కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ గ్రంథాలయం నూతన కార్యవర్గం ఎన్నిక





గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు రమణాజీ, వెంకటరమణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయం అధ్యక్షుడిగా బుద్ధ రమణాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కొణతాల సుబ్రహ్మణ్యం ఏసీ కల్యాణ మండలంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా కాండ్రేగుల వెంకటరమణ, కోశాధికారిగా ఆడారి మోహన వెంకట రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా యల్లపు శ్రీను, దాడి వీరునాయుడు, సహాయ కార్యదర్శులుగా బుద్ధ జోగినాయుడు, కాండ్రేగుల నూకరాజు, కన్వీనర్‌గా బొడ్డేడ అప్పారావు, కార్యవర్గ సభ్యులుగా 23 మంది ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల వెంకటరావు, దాడి స్వామినాయుడు, పి.నరసింగరావు వ్యవహరించారు. పై కమిటీ ఎన్నిక 2029 వరకు ఉంటుందని ఎన్నికల అధికారులు చెప్పారు.

మెరక పంటలకు ప్రాణం పోసిన వర్షం




ఆగాకర సాగుకు ప్రాణం పోసిన వర్షం



వర్షం వల్ల కళకళలాడుతున్న కర్రపెండ్లం తోట

గొలుగొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో శుక్ర, శనివారాల్లో సాయంత్రం కురిసిన భారీ వర్షం మెరక పంటలకు ప్రాణం పోసింది. ఎండిపోతున్న వరి నారుమడులకు ఎంతో మేలు చేసింది. గడిచిన 15 రోజులు నుంచి ఎండల తీవ్రత వల్ల పంటలకు ఎంతో నష్టం కలిగే పరిస్థితి వచ్చింది. నారుమడులు సైతం ఎండిపోయాయి. మెరక భూముల్లో వేసిన ఆగాకర, కర్రపెండ్లం, చేదుకాకర, బీర పంటలకు ఎంతో నష్టం వాటిల్లింది. మంచి వర్షాలు కురిసే సమయంలో ఎండల వల్ల ఆయా పంటలు సాగు చేసే రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంటలు ఎండిపోయే పరిస్థితి రావడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలో శుక్ర, శనివారాల్లో సాయంత్రం భారీ వర్షం కురవడంతో పంటలు ఊపిరి పోసుకున్నాయి. మరో రెండు భారీ వర్షాలు కురిస్తే మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

వరి నారుమడులకు తెగుళ్ల బెడద



ఆకుమడిని ఆశించిన పాడతెగులు భాగం, తెగులు పట్టిన ఆకుమడిలో పిచికారీ చేస్తున్న రైతు

రోలుగుంట: మండలంలో వరి నారుమడులు అనంతరం కలిసిరాని వాతావరణంతో రైతులు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. అసలే వర్షధార మండలం. ఆపై ఎండలు. దీంతో వరి నారుమడులకు అనుకూల తడులు లేక ఎండిపోతున్నాయి. మరో పక్క తెగులు బెడద వెంటాడుతోంది. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి చిరంజీవి పలు సూచనలు చేశారు. ఎకరా విస్తీర్ణంలో ఆకుమడికి 100 ఎం.ఎల్ హెక్సో కొనజోల్‌ను పిచికారీ చేస్తే తెగుళ్ల నివారణ సాధ్యమవుతుందన్నారు.